కథా నిలయం
శ్రీకాకుళం

# ఈపాటి సుకము

"వస్తే మీరూ నాతో రండి సార్! మెయిన్ రోడ్ నుంచి ఏదో రకంగా మీరు బెంగుళూరు వెళ్ళిపోవచ్చు. లేకుంటే నేను వచ్చే దాకా మెదలకుండా కారులోనే కూచోండి" అని ఖచ్చితంగా చెప్పాడు డ్రైవర్ నారాయణ. "మీరు కారు దిగి షికార్లు కొట్టే పని పెట్టుకుంటే మాత్రం యమ డేంజర్! ఈ అడవిలో పులులు ఉంటాయో లేదో గాని అటూ ఇటూ పాములు మాత్రం తప్పకుండా బుస కొడుతుంటాయి. మిమ్మల్ని ఇలా వదిలి వెళ్ళడం చాలా తప్పు... తర్వాత నలుగురూ నన్నే అంటారు..."

చిరకాల మిత్రుడి కన్న ఎక్కువే అయిన డ్రైవర్ నారాయణని చనువుగా భుజం తట్టి బుజ్జగించాడు విశ్వనాథ్. "మరేం ఫర్లేదు వెళ్ళిరా! టైర్ పంచర్ వేయించడంతో బాటు తప్పకుండా నాక్కూడా సిగిరెట్లు తేవాలి. మర్చిపోకు. ప్రొద్దున్న పదిన్నరకల్లా నేను కోర్టులో ఉండాలి... గో ఆన్ క్విక్!..."

"పని జరగాలే గాని ఇలా వెళ్ళి అలా వచ్చెయ్యనూ? ఖర్మ గాకుంటే టైర్లు ఇలా పంచరయ్యేట్టయితే నాలుగు స్టెప్నీలు ఉన్నా చాలదు..." అని గొణుక్కుంటూ టైర్ మోసుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ దూరమై పోయాడు నారాయణ.

అంతకు ముందే అతన్నుంచి స్వాధీనం చేసుకున్న సిగరెట్ ప్యాకెట్ తెరిచి దిగులుగా చూసుకున్నాడు విశ్వనాథ్. మూడే ఉన్నాయి. చాలవు. అదుపులో ఉండాలి. తప్పదు. చలి. వెన్నెల. అడవి. కీచురాళ్ళ రొద.

డ్రైవర్ వెళ్ళిపోయిన కాస్సేపటికి హఠాత్తుగా దిగులనిపించింది. భయం కాదు. దిగులు. నారాయణతో బాటు తనూ వెళ్ళిపో వలసిందేమో! అర్థరాత్రి దాటింది. నర సంచారం లేదు. గతుకుల రోడ్డు నీరసంగా మెరుస్తోంది. ఎటు పుంగనూరు! ఎటు పలమనేరు! ఎటు మదనపల్లె! అంతా డ్రైవర్ నారాయణకే తెలియాలి. చిక్కుకు పోవడం అంటే ఇదే! కారు వెనక సీటులో ముడుచుకుని

కూచున్నాడు విశ్వనాథ్. నిద్ర పట్టేస్తే బాగుంటుంది. వెంటనే డ్రైవర్ నారాయణ వచ్చి తట్టి లేపితే బాగుంటుంది. కాలం గబుక్కున గడిచిపోతే బాగుంటుంది. కాని అంతా మనం అనుకున్నట్టే ఎందుకు జరుగుతుంది? జరగదు. ఒక్కోసారి అనుకోనిది కూడా జరుగుతుంది... ...

చాలా కాలం క్రితం లాయర్‌గా బెంగుళూరులో స్థిరపడ్డాడు విశ్వనాథ్. వయస్సు యాభై చేరుతున్నా హుషారు తగ్గలేదు. పాత సివిల్ కేసు ఒకటి ఈ మధ్యనే రాజీకి వచ్చింది. విశ్వనాథ్ కక్షిదారుడి స్వస్థలం పుంగనూరు మదనపల్లె మధ్య ఒక మారుమూల పల్లెటూరు. ఆస్తిపాస్తు లేమో బెంగుళూరులో ఉన్నాయి. వాళ్ళ తండ్రి స్వగ్రామంలో ఉండిపోయాడు. ఆయనకి ఎనభై దాటింది. ఆయన ఒప్పుకుంటేనే రాజీ కుదురుతుంది. అయితే ఆయన బెంగుళూరుకి రాలేడు. ఆరోగ్యం క్షీణించింది. కారులో కూడా రాలేడు. ఒప్పించ డానికి విశ్వనాథ్ కారులో వచ్చాడు. రోజంతా సంప్రదింపులతో సరిపోయింది. భోంచేసి గాని కదల కూడదు అంటే వాళ్ళ మాట కాదన లేక పోయాడు. రాత్రి పదికి బయలు దేరాక అరగంటకే బ్యాక్ టైర్ పంచర్ పడింది. స్టెప్నీ ఆదుకున్నది. కాని అర్థరాత్రికి ఫ్రంట్ టైర్ మూలిగింది. అదీ పంచరే. అటూ ఇటూ కాని అడవిలో కారు ఆగిపోయింది. ఉదయానికి బెంగుళూరులో ఉండి తీరాలి. పదిన్నరకు కోర్టులో ఉండకపోతే మరో ముఖ్యమైన కేసులో కొంప లంటు కుంటాయి.

జూనియర్ల కేమీ జాగర్తలు చెప్పిరాలేదు. కాబట్టి ప్రయాణం ఆగకూడదు. వెళ్ళి తీరాలి. అడవిలో ఒక్కడుగా ఉండిపోయే పరిస్థితి మామూలు పరిస్థితి కాదు. ఇలాంటప్పుడు ఏం చెయ్యాలో ఎవ్వరూ చెప్పలేదు. కదలకుండా కారులో ఉండిపోవడం ఉత్తమమైన పనే. పడుకుంటే నిద్ర పడితే అత్యుత్తమమే. కాని నిద్ర పట్టదు. పులుల సంగతి తెలియదు కాని పాములు ఉండ వచ్చు అన్నాడు డ్రైవర్ నారాయణ.

పాములు ఉండవచ్చు కాని అవి మన మీదికే వచ్చి బుస కొడతా యని భారత రాజ్యాంగంలో చెప్పలేదు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో లేదు. నవ్వుకుంటూ కారు దిగాడు లాయర్ విశ్వనాథ్.

చల్లటి చలి గాలిలో వెన్నెల ఏదో మంత్రం వేస్తూ ఉంది. స్వర్గ దేవతలు విహరించే వేళ కాబోలు. యక్ష గంధర్వ కిన్నెర కింపురుషులు లీలా వినోదంగా భూలోకానికి సమీపంగా విహరించే సమయం కాబోలు. లేకుంటే అంత ప్రశాంత

రాత్రిలో ఎక్కడి నుంచో ఆనంద తరంగాలు పొర్లి వస్తున్నట్టు ఏదో తెలియని మాధుర్యం ఎలా ఆవరిస్తుంది?

దీని పేరు మహిమ. రాత్రి మహిమ. సృష్టి మహిమ. ఇది మానవ లోకమే కాదు. భూలోకం లోనే మరో లోకం ఉన్నదేమో అనిపించే సంతోష సీమ.

అటూ ఇటూ పచార్లు చేస్తుండగా చెట్ల చాటు నుండి సన్నటి కాలిదారి కనిపించింది. దారి మలుపు తిరిగే చోట చిన్న గుట్ట ఉంది. అక్కడ పెద్ద బండరాళ్ళు వెన్నెల్లో వెన్న ముద్దల్లాగ మెరుస్తున్నాయి. అక్కడి కెళ్ళి కూచుని సిగరెట్ తాగుదా మనిపించింది.

వెంటనే కాలి దారినే కదిలాడు విశ్వనాథ్. కాళ్ళకి పాములు తగిలితే అంతే సంగతులు. కాని జీవితం అన్నాక అమాత్రం తెగువ ఉండాలి. చూద్దాం కానీ అనుకోవాలి. వెళ్ళగా వెళ్ళగా దూరం తెలియలేదు. కనుచూపు మేరగా కనిపించిన గుట్ట నిజానికి చాలా దూరమే ఉంది. కష్టపడి ఎక్కి చూసే సరికి అక్కడి నుంచి రోడ్డూ కనబడ లేదు. కారూ కనబడ లేదు. ఏమైతేనేం గుట్ట పైదాకా వెళ్ళి అవతలికి చూసేసరికి ఒళ్ళు జలదరించింది. అర్ధ చంద్రాకారంగా ఉన్న చిన్న చిన్న గుట్టల మధ్య వెండి వెన్నెలలో తళతళా అమృతకాసారంలా మెరుస్తున్నది చెరువు.

"వావ్!" అనుకుంటూ ఒక చదునైన బండ మీద కూచుని తీరిగ్గా సిగరెట్టు వెలిగించి వెన్నెల్లోకి ఊదాడు. తియ్యగా వెచ్చగా మత్తుగా అనిపించింది. "ఇదీ లోకం అంటే...ఇదీ జీవితం అంటే.." అనుకుంటూ ఉండగానే అవతల చెరువు వార నుంచి ఏదో అలికిడి వినిపించింది. గల్లుమన్న శబ్దానికి గుండె జల్లుమంది.

"ఎవరు వోరు?"

వెన్నెల్లో మెరుపు కొట్టింది. అర్ధరాత్రి. ఆడ గొంతు. అడవికే గొంతొచ్చిందా? వనలక్ష్మి మాట్లాడుతోందా?

మళ్ళీ పలికింది. " ఎవరు వోరంటే?.."

పొదల మధ్య నుంచి వచ్చింది గొంతు. గొంతుకే రూపం వచ్చింది. వెన్నెల నీడల్లో మసక నీడే మెరుపయింది. పాతకాలపు పల్లెటూరి చీరకట్టు. పెద్ద కొప్పు. తళుక్కుమన్న మెళ్ళో పూసల పేరు.

"ఎవరూ?" అన్నాడు విశ్వనాథ్ నమ్మలేక పోతూ.

అవతలి నుంచి వెంటనే మాట లేదు. వెన్నెల చలిలో మాటలే గడ్డగట్టి పోతున్నాయా? చూపులు బారుగా సాగి ఆగి తూగిన ట్లయింది.

"ఎవ్వరూ నువ్వూ?" అని విశ్వనాథ్ సాగదీశాడు.

"యింతకీ నువ్వెవరు బాబూ?... అలికిడి యినీ... మా బావ అనుకున్నా! వస్తానన్నాడు కదా అనీ..." సన్న సెలయేరు పారినట్టూ పాడినట్టూ ఉంది. పారుతున్న ఏరు నిర్భయంగా సహజంగా దగ్గరికే వచ్చింది. "యెవరు బాబూ నువ్వూ?..."

ఏదో సహజ పరిమళం పూర్వస్మృతి లాగా కమ్ముతూ ఉంది. చిరపరిచిత మైన మనిషే ఎదురైనట్టు. తన కోసమే ఎదురు చూస్తున్నట్టు. మరి బావా అంటుందేమిటి?

తన గురించి చెప్ప గలిగి నంతా చెప్పాడు విశ్వనాథ్. "అయినా నువ్వెవరూ? ఇటు ఏ ఊరు వస్తుందీ? ఈ రాత్రి వేళ ఒక్కత్తివీ ఇక్కడ ఇలా ఎందుకున్నట్టూ?" అన్నాడో అనాలనుకున్నాడో అన్నా ననుకున్నాడో విశ్వనాథ్ గుండెకూ గొంతుకూ మధ్య పోరాటం మొదలయింది. ఎప్పుడో మొదలైన పోరాటం కాబోలు ఇప్పుడు పెద్ద ఆరాటమైంది. గుండె గొంతుక లోన కొట్లాడతాదీ అనే కూనిరాగం చెవుల్లో మంద్రస్థాయిలో మోగుతూ ఉంది.

"అయ్యో...నా మీద దిగులు పడతావేం బాబూ? నువ్వొచ్చి ఈ అడివిలో దిగబడి పోలేదూ? ఇక్కడ నీకు దిక్కెవ రనుకుం టున్నావూ? బలే వోడివే..." అంటూ ఆమె ముందుకు నడిచింది.

ఆమె రమ్మనలేదు. అయినా రమ్మన్నట్టే అనిపించింది. వెంట నడిచాడు. నడుస్తూ నడుస్తూ ఆమె టక్కున ఆగిపోయి కళ్ళారా ముందుకు చూసింది.

"యెన్నె లెంత బాగుందో చూడు బాబూ... యెన్నెట్లో యీ చెరువు చూడూ...అద్దమల్లే లేదూ?..." అంటూ ఆమె ఇంకా ముందుకు నడుస్తుండగా అనుసరించాడు. ఆమె నడుస్తున్నట్టే లేదు. సన్నటి నడుము ఊగుతుంటే ఆమె కూడా ఊగిపోతూ వెళ్తోంది. కండెలా మెలికెలు తిరిగిన శరీరం ఒక పాము నిలువుగా నడుస్తున్నట్టే ఉంది.

గుట్టకు అవతలి వైపుకి దిగేసి చెరువు గట్టు చేరే సరికి అది పూర్తిగా వేరే లోకమైపోయింది. పైనుంచి చూసిన చెరువు వేరు. కిందినుంచి సరిసమంగా చూస్తే నీటి వాలు వేరు. అద్దంలా నిశ్చలంగా ఉన్న నీటి మీద వెన్నెల మెత్తగా కుండపోతగా కురుస్తోంది. చెదురుతోంది. వెలుగుతోంది. మట్టిమీద నడుస్తుంటే

మంత్ర సీమలో విహరిస్తున్నట్టే ఉంది.

"యెన్నెల రాత్రి... యేమీ తోచలేదు...బావ వొస్తాడనుకున్నా... యింక రాడు... దిగులు పడిపోతుంటే నువ్వొచ్చావు. యిప్పుడు బాగనిపిస్తోంది. అందుకే యెవరో వొకరు మణిసంటూ వుండాల అంటారు..." అని వారగా ఉన్న రెండు బండరాళ్ళలో ఒక రాయి మీద ఒరిగి కూచుంది. "రా... బాబూ! యిట్లా వొచ్చి కూచో...నేనూ బావా యెప్పుడూ యిక్కడే కూచుంటాం... యెంత బావుంటుందో... తెల్లారే దాకా కూచున్నా గాని తనివి తీరదు...."

విశ్వనాథ్ సందేహిస్తూ నిలుచుంటే ఆమె చెయ్యి సాచి అతని చెయ్యి అందుకుంది. నిలువెల్లా జల్లుమంది ఆ స్పర్శకు. మంత్ర ముగ్ధుడిలా వెళ్ళి ఆమె సరసనే కూచున్నాడు. "అరె....నువ్వూ మా బావలానే ఉన్నావే..." అంది అప్పుడే ముఖంలోకి తొలిసారిగా చూస్తూ.

యెన్నెలంతా మేసి యేరు నెమరేసింది...అని ఎవ్వరో ఎక్కడో పాడుతున్నట్టు అనిపించింది. అప్పుడే విశ్వనాథ్ మనస్సులో మెరుపులు మెరిశాయి. "ఆఁ...నువ్వు యెంకిలా ఉన్నావు!" అనేశాడు.

"యెంకెవరూ?" అని కళ్ళు పెద్దవి చేసింది.

యెంకెవ్వరని లోక మెపుడైన అడిగితే యెలుగు నీడల వైపు యేలెత్తి సూపింతు. పాట కమ్ముకుంటోంది. అంతా ఇంద్రజాలంలా ఉంది.

"నువ్వే యెంకివి అన్నా నమ్మొచ్చు. పోనీ నువ్వు యెంకిలాంటీ పిల్లవి!"

యెంకిలాంటీ పిల్ల లేదోయ్ లేదోయ్ యెంకి నా వొంకింక రాదోయ్ రాదోయ్. సుడి తిరుగుతున్న పాట మనస్సును కుదిపేస్తోంది. నండూరి సుబ్బారావు లాయర్. విశ్వనాథ్ లాయర్. అప్పుడో యెంకి. ఇప్పుడో యెంకి. మరి నాయుడు బావా? సుబ్బారావు గారే నాయుడు బావ. అయితే విశ్వనాథే ఈ అమ్మాయికి బావ.

ఆమె చెరువు వైపు చూస్తూ ఉండి గబుక్కున అడిగింది. "బాబూ చెరువులో దిగి ఈత కొడదామేంటి?"

హడలిపోయాడు. ఈ రాత్రా? ఇంత చలిలోనా? ఏమైనా పిచ్చా? వెర్రా?

గల్లుమని నవ్వింది. "యెర్రి చూపేంది బాబూ... చలికే బయమైతే యెట్లా...చలేం చేస్తుందని? నేనున్నాను కదా?" అంటూ యేరు పొర్లుతున్నట్టు మాట్లాడుతూనే ఉంది.

నిశ్చలంగా చూస్తూ ఉండిపోయాడు విశ్వనాథ్. కాలం గడ్డగట్టి

పోయింది. ఆమె ఏమిటేమిటో చెబుతూ ఉంది. వాళ్ళ పుట్టింటి సంగతులు. సంతలో సరుకులు కొన్న వైనం. మొన్న లారీ ప్రమాదంలో ఎవరో బంధువులు చనిపోయిన సంగతి. విశ్వనాథ్‌కు అవేమీ పట్టడమే లేదు. ఇలా ఎందుకు జరుగుతుందా అనుకుంటున్నాడు. ఏమవుతుందా అనుకుంటున్నాడు. వెన్నెల వాలుగా కదులుతూ ఉంది.

గడియారం ఆగిపోయిందా? టైము చూసుకోవాలని ఎన్నో సార్లు ప్రయత్నించాడు విశ్వనాథ్. సరిగ్గా తెలియడమే లేదు. ఒకసారి పన్నెండున్నర అనిపించింది. మరోసారి రెండయినట్టు అనిపించింది. కళ్ళమీదా చెవులమీదా మంచు పేరుకు పోయినట్టు జివ్వుమని లాగింది. ఆమె మాట్లాడుతోంది. అతను ఊఁ కొడుతున్నాడు. అంతే. ఆమెకు ఎన్నేళ్ళు ఉంటాయి? పాతికా? పద్దెనిమిదా? పుట్టింటి వారెవరు? అత్తగారి ఇల్లు ఎక్కడ? బావతో పెళ్ళిగాని అయిందా? కాలేదా?

“అసలింతకూ నువ్వేమైనా తిన్నావా బాబూ?” అని ఆమె అడిగే సరికి ఏం చెప్పాలో తోచలేదు. తనెవరో తెలియనంత అయోమయంలో ఉండగా తిండి సంగతి అడిగితే ఏం చెప్పాలి?

“రా పోదాం!” అంటూ లేడి పిల్లలా చెంగున లేచి దూకినట్టు పోతోంది. తప్ప దన్నట్టు అనుసరించాడు. పక్కనే చిన్న పల్లెటూరో గూడెమో ఉంటుం దనుకున్నాడు. ఇంత రాత్రప్పుడు ఒక మగ మనిషిని ఇంటికి తీసుకెళ్తే అందరూ ఏమను కుంటారు?

అంత గొడవ లేకపోయింది. పది గజాలు నడిచి చెరువు గట్టు పక్కనే వేపచెట్టు దగ్గర ఆగింది ఆమె. అంతసేపూ విశ్వనాథ్ గమనించనే లేదు. అక్కడో గుడిసె ఉంది. చాలా చిన్నది. ఆమె బాగా వంగి లోపలికి వెళ్ళింది. క్షణాల్లో గుడిసెలో గుడ్డి దీపం వెలిగింది. తల వంచి లోపలి కెళ్ళాడు విశ్వనాథ్. ఇద్దరు మనుషులకే అన్నట్టుంది ఆ గుడిసె. “బావకూ నాకూ భలే ఉంటుంది యిది” అంటూ నిముషంలో పొయ్యి వెలిగించింది. మట్టి పాత్రలు మూకుళ్ళు సత్తు గిన్నెలు పొయ్యి కోసం పేర్చి పెట్టుకున్న ఎండు పుల్లలు. జీవితం ఇంత సులువా అనిపించేంత పొందికగా ఉంది.

“మీరంతా దొరబాబులు. మా తిండి మీకేం సరిపోతుంది గాని...

యీ పూటకి తిను బాబూ..." అంటూ ఇది వరకే చేసి పెట్టిన రొట్టెలు అప్పుడు వేడి చేసి సత్తుగిన్నెలో పెట్టి అందించింది. "వంకాయ కూరే...బావకిష్టం... నీకూ ఇష్టమేనా?"

అప్పుడే తెలిసింది అమృతం అంటే జొన్న రొట్టే వంకాయ కూర లాగా ఉంటాయని.

"ఇంతకీ నీ అసలు పేరేమిటి? యెంకి కాకుంటే చెంద్రి రత్తి నూకాలు దుర్గ..."

"హహ..." అంటూ పగలబడి నవ్వింది. "యేదో వొక పేరు... నీకు నచ్చింది పెట్టుకో...మణుసులు పోతారు... పేర్లూ పోతాయి...మంచితనమే మిగి లుంటుంది...యింకో రొట్టె తిను..."

టక్కున పొలమారింది. సత్తు గిన్నెతో నీళ్ళు అందించింది. తాగుతూ కూడా అతను సతమత మౌతూ ఉంటే ముందుకొచ్చి తలమీద తట్టింది. "యెవరో తలుచుకుంటూ వుండారు బాబూ... నెమ్మది నెమ్మది..."

వెన్నెల మేఘాలు వాలి పోయినట్టు ఆమె వక్షం అతని కళ్ళ ముందు ఊగి పోయింది.

"మరి...నువ్వు తినవా?"

"ఆకలి లేదులే... నువ్వు తింటే నేను తిన్నట్టే! నువ్వు చుట్ట కాలుస్తావా?" అంటూనే విశ్వనాథ్ సిగరెట్టు నోట పెట్టుకునే సరికి అగ్గిపుల్ల తీసి వెలిగించింది.

ఇద్దరూ బైట కొచ్చారు. చెట్లన్నీ పూర్తి నిద్ర లోకి వెళ్ళి పోయాయి. వెన్నెల ముదిరి పోయింది. ఏదో పాట లాగా గాలి శబ్దం తేలి తేలి వస్తోంది. అదేమిటో స్పష్టంగా తెలియడం లేదు. ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా!... ఎందుకని ఈ పాట గుర్తొచ్చిందీ?

గుడిసె నుంచి కొంచెం పక్కకు దిగి నడిస్తే అక్కడో అరుగు ఉంది. ఆమె వెళ్ళి అరుగు మీద కూచుని కాళ్ళూపుతూ వెనక్కి వాలి నెమ్మదిగా వొళ్ళు విరుచుకుంది. అక్కడి నుంచి చెరువు అంచు వెండి పళ్ళెంలా కనిపిస్తూ ఉంది. సిగరెట్టు పొగ మేఘాల గుండా చూస్తుండగా విశ్వనాథ్‌కు కళ్ళు మసకేశాయి.

"యెట్టా వొచ్చినావో గాని బలే వొచ్చినావు బాబూ నువ్వు!... మళ్ళా యెప్పుడొస్తావూ... యెందుకొస్తావు గానీ... దా బాబూ..." అంటూ చేతులు సాచింది.

అనాది నుంచీ అదే ఆహ్వానం. ఆడదాని పిలుపు. "దా!..."

ఎక్కడికో తెలియని ప్రయాణం అది. అంతు పట్టని రహస్యం స్త్రీ. ఆమె లోకి ప్రయాణం. దాని పేరు ప్రణయం. చీకటి అనుకుంటే కాదు వెలుగే అన్నట్టు వెన్నెల.

వెన్నెట్లో ఆ అరుగు పూల పానుపే అయింది. హంస తూలికా తల్పం అనిపించింది.

ఆమె కళ్ళు మూసుకుంది. వెన్నెల ఆమె కనురెప్పల మీద సోగగా చారగా మెరిసింది. ఆమె యెద మీద విశ్వనాథ్ ఊపిరి సుడి తిరిగింది. ఆ సుడిగుండాల్లో కొట్టుకు పోకుండా ఆమె ఆపుతూ ఉంది. నవ్వుతూ ఉంది. ఓరగా ఒళ్ళు తెరిచీ తెరవని చూపు. ఎటు చూస్తోంది? అతని వైపా? వెన్నెల లోకా? "పిచ్చి బాబూ... ఎంత అలిసిపోయావు నువ్వూ..." అనే ఆమె పలుకు మధుర మోహనంగా మోగిపోయేప్పుడే ఇంద్ర ధనస్సు కరిగి మాయమయింది. అతని అస్తిత్వమే సురిగి పోయింది. వాలిపోయాడు.

ఈ పాటి సుకము నే నింతవర కెరగనే... అంటోంది విశ్వనాథ్ గుండె చప్పుడు. పక్షినై ఎగిరిపోతున్నాను... అనిపించింది.

పక్షి లోయలోకి దిగుతూ వాలుగా ఎగురుతూ పోతూంది. అనాది పక్షి అది. ఆమె ముఖం గిరిశిఖరాల వాలులో లీలగా మెదిలింది. ఏమిటో మాట్లాడుతూ ఉంది. కలలోన నా యెంకి కతలు చెబుతుండాది. కౌగిట్లో ఉన్న ఆడది కలలో కూడా ఉందే! అరె... కరిగి పోతుందా? కదిలి పోతుందా? వద్దు. పోకూడదు. వెళ్ళి పోకూడదు. కావాలి. ఇదే కావాలీ...

"సార్!... లేవండి లేవండీ..."

"బాబూ లేవండీ..."

జలదరిస్తూ లేచాడు విశ్వనాథ్. అప్పుడే తెల్లవారుతూ ఉంది. మీదకు వంగిన ముఖాల్లో డ్రైవర్ నారాయణని మాత్రం వెంటనే గుర్తు పట్టాడు. రాత్రి ఏమైంది? యెంకి లాంటి పిల్ల ఏమైంది? ఈ కొత్త మనుషు లెవరూ?

డ్రైవర్ నారాయణ చెబుతున్నాడు. "పంచర్ వేసుకొచ్చే సరికి లేటై పోయింది సార్... లారీ లెక్కి వ్యాన్ లెక్కి పడీ లేచీ వొచ్చాను. వొచ్చే సరికి మీరు లేరు. రాత్రి మనకు తెలీలేదు గానీ పక్కనే చిన్న పల్లె ఉందండి... వెళ్ళి వాకబు చేశాను... పురుగో పుట్రో కరిచిందేమో నని అందరూ గాభరా పడి...

వెతికే సరికి... తెల్లారే పోయింది... అదేంటి సార్... కాస్త కారు వైపు నుంచి ఎడమకి వెళ్తే ఊరొచ్చేది..."

మత్తు మెల్లమెల్లగా దిగుతూ ఉంది. వెర్రి వాడిలా చుట్టూ చూస్తూ చెరువు గట్టు ఎక్కాడు. అటూ ఇటూ వెతికాడు. వేపచెట్టు పక్కన పాత గుడిసె శిథిలమై ఉంది. దానికి తలుపంటూ లేదు. పొయ్యి లేదు. పాత్రలు లేవు. చాలా కాలంగా మనిషి మెదిలిన చాయే లేదు. చెరువు ఇప్పుడు తేట తెల్లంగా నవ్వుతూ ఉంది. రాత్రి తను పడుకున్న తిన్నె వైపు అనుమానంగా చూశాడు. "భలే ఉందే...హాయిగా నిద్ర పోయాను...ఇక్కడ ఈ అరుగు ఎవరు కట్టారో ఎందుకు కట్టారోగాని..."

గ్రామస్థుల్లో ఒకడు పేలవంగా నవ్వాడు. "అది అరుగు కాదండీ... గోరీ.."

"ఓహ్... ఎవరిదీ?..."

"మేమూ చూళ్ళేదు గానీ... ముప్పైయేళ్ళ క్రితం యెంకటలక్ష్మి అనే అమ్మాయి వుండే దంటండి... పక్క వూరు అబ్బాయిని యిష్ట పడింది... మనువు జరగ లేదు. ఇటూ అటూ పెద్దలు వొప్పుకోలే దంటారు... వాళ్ళ మధ్యన యేవో గొడవలు వుండే వంటారు...మనువు లేకున్నా...మనసులు కలిసిన వాళ్ళు వూరుకుంటారా?... యిద్దరూ ఈ చెరువు దగ్గర కలుసుకునే వోరంట... ఆళ్ళ కతలన్నీ మనకి తెలీవు గానండీ... పాము కరిసి బావ చచ్చిపోయినా గాని... యెంకటలక్ష్మి మాత్రం యీ చెరువు గట్టున్నే వుండి పోయిం దని చెప్పుకుంటారు... యీ దిక్కు యెవరూ వచ్చేవారు కారు... యిప్పుడైనా రాత్రయితే యిటు పిట్ట మెదలదండి... మనువే లేకుండా బతుకంతా యిక్కడే గడిపేసిన యెంకటలక్ష్మి యేదో మాయ జబ్బు వచ్చి చచ్చిపోయిం దంటండి... నలుగురూ కలిసి ఆమె గుర్తుగా సమాధి కట్టించారండి... రాత్రి గాని మీరు గాని దడుసుకో లేదు గదండీ?... మీకు భలే ధైర్యం వుందండీ..."

కలా? నిజమా? ఇంకా నమ్మడం లేదు విశ్వనాథ్. ఎటూ తేల్చుకో లేక పోయాడు.

అప్పటికీ ఇప్పటికీ అంతే.

యెంకి పాటలంటే మాత్రం ఉలికులికి పడతాడు.